సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శనివారం | 4 | ఫిబ్రవరి | 2023



అసిస్టెంట్ రిజిస్ట్రార్ల బదిలీలు

కేయూలో ముగ్గురు అసిస్టెంట్ రిజిస్ట్రార్లను అంతర్గతంగా బదిలీ చేస్తూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

- 8లో▸



కాంగ్రెస్‌దే అధికారం

రానున్న రోజుల్లో దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారం అని టీపీసీసీ సభ్యుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు.

- 9లో▸

గరిష్టం/కనిష్టం
32.2^0 / 14.5^0

వాతావరణం

జిల్లాలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయి. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పీఎస్‌బీతో ఎరువులు ఆదా



గణపురం: యాసంగిలో రైతులు (పీఎస్‌బీ) పాస్ఫరస్ సొల్యులైజింగ్ బాక్టీరియా ఎరువుల వాడడంతో డీఏపీని ఆదా చేసుకోవడంతోపాటు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్ అన్నారు. మండలంలోని ధర్మరావుపేట గ్రామంలో వరి పంటలను మండల వ్యవసాయ అధికారి డి.అయిలయ్య ఆధ్వర్యంలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటల సాగుతో అధిక లాభాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ప్రత్యేక సబ్సిడీలను అందజేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రణయ్, సర్పంచ్ పోతుల ఆగమ్మ, రైతులు పాల్గొన్నారు.

బ్యాంకు భవనం ప్రారంభం



మహదేవపూర్: మహదేవపూర్ మండలకేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ కార్యాలయాన్ని సర్కిల్ జనరల్ మేనేజర్ (సీజీఎం) సురేష్‌చంద్రతేలి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పలిమెల మండలానికి చెందిన మహిళా గ్రూపులకు రూ.కోటి 50లక్షల చెక్కు అందించారు. శనివారం నుంచి బ్యాంకులో గోల్డ్‌లోన్ సౌకర్యం ఉంటుందని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలిమెల ఎంపీపీ బుచ్చక్క, మహదేవపూర్ జెడ్పీటీసీ అరుణ, బ్యాంక్ రీజినల్ హెడ్ సత్యం, డిప్యూటీ రీజినల్ హెడ్ వజీర్ సుల్తాన్, బ్రాంచ్ మేనేజర్ పరమేష్ పాల్గొన్నారు.

అధికారులను కలిసిన సేవాలాల్ సేన నాయకులు



భూపాలపల్లి రూరల్: జిల్లా సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు భుక్యా సురేష్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం డీఎఫ్‌ఓ భూక్య లావణ్య, భూపాలపల్లి సీఐ రాజిరెడ్డి, ఎస్సై రామకృష్ణలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధికారులను సన్మానించి జ్ఞాపికలు అందించారు. ఈ నెలలో జిల్లాలో కేంద్రంలో జరిగే సేవాలాల్ జయంతి వేడుకలకు హాజరు కావాలని కోరినట్లు సురేష్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సేవాలాల్ సేన జిల్లా మహిళా అధ్యక్షురాలు దరావత్ శారదబాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు వాలునాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మధుకర్ నాయక్, నాయకులు సాయిరాం నాయక్, రాంసింగ్, రాజు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని కేటీకే 5వ గని మూలమలుపు వద్ద వాహనాలు తనిఖీచేస్తుండగా ఎండు గంజాయి విక్రయదారుడిని పట్టుకున్నట్లు సీఐ రాజిరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వాహనాలు తనిఖీ చేస్తుండగా గణపురం మండలంలోని బొబ్బలోనిపల్లి గ్రామానికి చెందిన నేరేళ్ల ప్రవీణ్ ద్విచక్ర వాహనంపై 975గ్రాముల గంజాయిని తీసుకువస్తూ పట్టుపడినట్లు తెలిపారు. ఛత్తీస్‌ఘడ్‌లో కొనుగోలు చేసి పట్టణంలోని జవహర్‌కాలనీకి చెందిన మహ్మద్‌షకీర్, అటుకాపురం రాకేష్‌లకు అమ్మేందుకు తీసుకువస్తున్నట్లు తెలిపారు. ప్రవీణ్‌ను విచారించి వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

రెండో రోజుకు చేరిన దీక్షలు

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలో జర్నలిస్టులకు కేటాయించిన ప్లాట్ల రద్దుకు కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్టులు చేపడుతున్న దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నాటికి రెండోరోజుకు చేరుకున్నాయి. జర్నలిస్టులు చేపడుతున్న దీక్షలకు వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్, ఆమ్ ఆద్మీపార్టీ జిల్లా ఇన్‌చార్జ్ నాగులు అరవింద్, బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ సమన్, వర్తక వ్యాపార సంఘం జిల్లా అధ్యక్షుడు ఈగ రవికిరణ్, సామాజిక కార్యకర్త నాగవెళ్లి రాజలింగమూర్తి మద్దతు తెలుపగా ఈ కార్యక్రమంలో స్థానిక జర్నలిస్టులు పాల్గొన్నారు.

సారలమ్మ గద్దెపై మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



మనసారా మొక్కులు

మేడారానికి పోటెత్తిన భక్తులు

సమ్మక్క-సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు శుక్రవారం తరలివచ్చారు. ములుగు జిల్లా మేడారంలో జరుగుతున్న మినీ జాతరకు తెలంగాణలోని పలు ప్రాంతాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి జనం వచ్చి మనసారా మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గద్దెల ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. వనదేవతలను పలువురు అధికారులు దర్శించుకున్నారు.

- ఎస్ఎస్ తాడ్వాయి

- వివరాలు 8లో▸



మొక్కులు చెల్లించేందుకు వస్తున్న భక్తులు



తులాభారం..



అభివృద్ధిని గాలికొదిలేసిన ఎమ్మెల్యే

- చైర్మన్ హోదాలో ఉండి చేసిందేమీ లేదు..
- జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి

మహదేవపూర్: మహదేవపూర్ మండలంతో పాటు చుట్టు పక్కల నాలుగు మండలాలకు పెద్దాస్పత్రిగా పేరుపొందిన మహదేవపూర్ సీహెచ్‌సీ అభివృద్ధిని మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు గాలికొదిలేశారని భూపాలపల్లి జెడ్పీచైర్‌పర్సన్ జక్కు హర్షిణి విమర్శించారు. శుక్రవారం ఆమె మహదేవపూర్ సీహెచ్‌సీని సందర్శించారు. ఆస్పత్రిలోని డయాలసిస్ పరికరాలు, ఈసీజీ, ల్యాబ్, ఎక్స్‌రే సదుపాయాలు, ఆక్సిజన్ లైన్లు, పరికరాల షెడ్, మదర్-చైల్డ్ ఇంటెన్సివ్ కేర్, ఆపరేషన్ థియేటర్, ఆస్పత్రి సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్యరంగానికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మంథని నియోజకవర్గంలో తూర్పున ఉన్న నాలుగు మండలాల ప్రజలకు ఎన్నో ఏండ్లుగా అత్యవసర వైద్యసేవలు అందించే ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి అధ్వాన స్థితిలో ఉండటం బాధగా ఉందన్నారు. ఆస్పత్రిలో సకల సౌకర్యాలు ఉండి దీనావస్థలోకి నెట్టేయడానికి చైర్మన్ హోదాలో ఉన్న ఎమ్మెల్యే నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. ఏనాడూ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఏర్పాటు చేయలేదన్నారు. సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేయలేదని చెప్పారు. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పలుమార్లు ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. కలెక్టర్ సహాయ సహకారాలతో డయాలసిస్ సెంటర్ మంజూరు చేయించామని తెలిపారు. ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ లేకపోవడంతో డెలివరీల కోసం గర్భిణులు జిల్లాకేంద్రానికి వెళుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాణిభాయి, సర్పంచ్ శ్రీపతిబాపు, ఉప సర్పంచ్ సల్మాన్ ఖాన్, ఎంపీటీసీ రెవెల్లి మమత, బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ మహిళా ఇన్‌చార్జ్ కేదారి గీత, మండల యూత్ అధ్యక్షుడు అలీం ఖాన్, టౌన్ అధ్యక్షుడు కూరతోట రాకేశ్ పాల్గొన్నారు.



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర ప్రజాసంఘాల పిలుపు మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరుపేదలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, ఆదివాసీలు, యువజనులు, విద్యార్థులు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అన్ని కులాల పేదలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు కాంపెటి రాజయ్య, చెన్నూరి రమేష్, టీఏజీఎస్ అధ్యక్ష కార్యదర్శులు పోలం రాజేందర్, సూదుల శంకర్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షల రూపాయల ఆర్థిక సాయం ప్రభుత్వం చేయాలన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

‘కాళేశ్వరం’ ధ్వజస్తంభాల ప్రతిష్ఠ ఎప్పుడో!

నెలలు గడుస్తున్నా పట్టింపు లేదు..

కాళేశ్వరం: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయాల్లో ధ్వజస్తంభాలు వెక్కిరిస్తున్నాయి. గతేడాది వర్షాకాలంలో శుభానందదేవి (పార్వతి)అమ్మవారి ఆలయంలో ధ్వజస్తంభం తడిసి విరిగి పడింది. అప్పటి నుంచి ఒక కర్రకు స్తంభం మాదిరిగా సంప్రోక్షణ చేసి ఉంచారు. ఇదిలా ఉండగా...అడవిలో వెలసిన శ్రీ ఆదిముక్తీశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభం కలశాలు ఇతర భాగాలు భిన్నంగా మారాయి. అక్కడ కూడా ధ్వజస్తంభం ఏర్పాటు అవసరం. శ్రీరామాలయంలో ధ్వజస్తంభం ఏర్పాటు చేసిన కలశాలు సరిగ్గా కుదురలేదు. ఆ ధ్వజస్తంభానికి కూడా రిపేర్లు జరుగాల్సి ఉంది. దేవాదాయశాఖ అధికారులు మాత్రం నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనుల్లో వేగం పెంచడం లేదని విమర్శలు ఉన్నాయి. ధ్వజస్తంభాల కోసం అటవీశాఖ అనుమతి తీసుకున్నారు. అన్నారం, పలిమెల రేంజ్ పరిధిలో రెండు ధ్వజస్తంభాలను అధికారులు పరిశీలించారు. 40, 42 ఫీట్ల పొడవుగల రెండు నారవేప చెట్లను నరికి ధ్వజస్తంభాన్ని తయారు చేయనున్నారు. రెండు నారవేప చెట్లకు రూ.1.80లక్షలు, 2లక్షల వరకు అటవీశాఖకు ఫీజు చెల్లించినట్లు తెలిసింది. ఇప్పటివరకు స్తంభాలు ఏర్పాటు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఆ నరికివేత పని ప్రారంభం కాలేదు. ఈ నెల 17నుంచి19 వరకు మూడు రోజుల పాటు జరిగే మహా శివరాత్రి ఉత్సవాల్లో శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో ధ్వజస్తంభం లేకుండానే ఉత్సవాలు జరుగనున్నాయి. మార్చి నెలలో మూఢాలు ఉన్నాయి. వైశాఖ మాసం అంటే మే నెల వరకు ఆగాల్సిందే అని తెలిసింది. ఉగాది ముందు పదిహేను రోజులు, తర్వాత 15రోజులు ప్రతిష్ఠలు చేయరాదని తెలిసింది. ఈ విషయమై ఈఓ మహేష్‌ను వివరణ కోరగా.. అటవీశాఖకు రెండు ధ్వజస్తంభాల కోసం ఫీజు చెల్లించాం. త్వరలో ప్రతిష్ఠ చేస్తామని తెలిపారు.



శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో కర్రతో ఏర్పాటు చేసిన స్తంభం



పలిమెల రేంజ్‌లో పరిశీలన చేసిన నారవేప చెట్టు

జాతీయ రహదారి కోసం సర్వే!

కాళేశ్వరం: మహదేవపూర్ టు కాళేశ్వరం వరకు జాతీయ రహదారి రోడ్డు నిర్మాణం కోసం రూ.163కోట్ల నిధులు మంజూరు చేసి పీఎం మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన జరిగి పనులు మొదలు పెట్టడంతో జాప్యం జరుగుతున్న విషయం తెలిసిందే. ఎట్టకేలకు శుక్రవారం మహదేవపూర్ తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్ఐ రాజశేఖర్, సర్వేయర్‌లు స్థానిక సబ్‌స్టేషన్ నుంచి పొలాల మీదుగా సర్వేనంబర్లు రైతుల పేర్ల వారీగా జాబితా తయారు చేస్తున్నట్లు సమాచారం.

పేరూరు పోలీస్‌స్టేషన్ పరిశీలన

వాజేడు: ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన గౌస్ ఆలం, ఏటూరునాగారం ఏఎస్పీ సంక్రీత్ శుక్రవారం తొలిసారిగా మండల పరిధిలోని పేరూరు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. పేరూరుకు వచ్చిన వారు అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగారు.

హెచ్‌ఎంఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థలో బాలబాలికలకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకురాలు



శంకుస్థాపనతో సరి..!

- బాల సదనాలు లేక ఇబ్బందులు
- ప్రైవేటు ఆశ్రమాల్లోనే బాల, బాలికలు
- ప్రారంభం కాని నిర్మాణ పనులు

భూపాలపల్లి రూరల్: జిల్లాకేంద్రంలో బాల సదన భవన నిర్మాణం కోసం మంత్రి సత్యవతి రాథోడ్ శంకుస్థాపన చేసి ఐదు నెలలు అవుతున్నా ఇప్పటివరకు పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో జిల్లాలోని అనాథ బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అధికారులు భూపాలపల్లి, టారం, గణపురం మండలాల్లోని ప్రైవేట్ ఆశ్రమాలకు తరలిస్తున్నారు. బాల సదనాలు, శిశుగృహాలు ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో మాత్రమే ఉన్నాయి. జిల్లాల పునర్విభజన తర్వాత కొత్త జిల్లాల్లో ఏర్పాటు చేయలేదు. జిల్లాల్లో చైల్డ్ ప్రొటక్షన్ యూనిట్లను 2018లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీలో 21 సెప్టెంబర్ 2022న స్త్రీ, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ జిల్లాలో అనాథ బాలికల సదన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఐదు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. దీంతో అనాథ బాలలతోపాటు అధికారుల కూడా ఇబ్బందులు పడుతున్నారు. కాపాడిన పిల్లలను అధికారులు హనుమకొండలోని బాల సదనానికి పంపిస్తున్నారు. మరికొంత మందిని జిల్లా కేంద్రంలోని హెచ్‌ఎం డీఆర్‌ఎస్ మూగ చెవిటి ఆశ్రమ పాఠశాల (స్వచ్ఛందసంస్థ)లో ఆశ్రయం కల్పిస్తున్నారు. బాలురను కాటారం మండల కేంద్రంలోని తిమోతి బాయ్స్ హోమ్, గణపురం మండలంలోని గాంధీనగర్‌లో ఉన్న హోమ్‌ఆఫ్ లవ్‌బాయ్స్ ప్రయివేటు ఆశ్రమాలకు తరలిస్తున్నారు.

జిల్లా సదనాల్లో ఆశ్రయం పొందుతున్న బాలబాలికలు

	బాలురు	బాలికలు	మొత్తం
కాటారం	40	-	40
భూపాలపల్లి	02	03	05
గణపురం	30	-	30

సదనాలు ఏర్పాటు చేయాలి..



జిల్లాలో బాలల సదనాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. జిల్లాలోని బాల బాలికలను అధికారులు స్వచ్ఛంద సంస్థల్లో చేర్పిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల సదనానికి ఏర్పాటు చేసిన స్థలంలో భవన నిర్మాణ పనులు చేపట్టాలి.

- గట్ల రాజన్న, ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్

1098కి ఫోన్ చేస్తే..



జిల్లాలో బాలబాలికలకు ఎలాంటి ఇబ్బందులున్నా అనాథలైన పిల్లల రక్షణకోసం 1098 చైల్డ్‌లైన్‌కు ఫోన్ చేస్తే అధికారులు వెంటనే స్పందిస్తారు. బాలలకు రక్షణ, వసతి కల్పించే ఏర్పాటు చేస్తారు. అనుమతులు వచ్చిన వెంటనే బాలికల సదన భవన నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటాం.

- సామ్యూల్, ఇన్‌చార్జ్ జిల్లా సంక్షేమాధికారి



బాలికల సదన భవనం కోసం శంకుస్థాపన చేసిన స్థలం



గణపురంలో ఉన్న హోమ్‌ఆఫ్ లవ్‌బాయ్స్ బాలుర హోం

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

ములుగు రూరల్: కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీర కృష్ణవేణినాయక్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. బీజేపీ దేశంలో అనేక రాష్ట్రాలలో అధికారంలో ఉందని తెలంగాణలో అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అత్యధికంగా ఇచ్చినప్పటికీ బీఆర్ఎస్ నాయకులు ఇష్టరీతిన మాట్లాడడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణికి 1,659 కోట్లు, ట్రైబల్ యూనివర్సిటీకి రూ.18 కోట్లు, స్కీములకు 10,500 కోట్లు, 15వ ఫైనాన్స్ కమిషన్‌కు 3వేల కోట్లను కేటాయించిందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం తప్పుడు మాటలతో ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నారని చెప్పారు. సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ధరణి పోర్టల్ తీసుకువచ్చి ప్రభుత్వం రైతులను అరిగోస పెడుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, సిరికొండ బలరాం, రవీంద్రాచారి, వాసుదేవరెడ్డి, కొత్త సురేందర్, కృష్ణాకర్, రాకేష్‌రెడ్డి, కవిరాజు, కిరణ్ అశోక్, విజయ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవేణినాయక్

జిల్లా అభివృద్ధికి సీఎం కృషి

ములుగు: జిల్లా అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారని గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మంత్రులు సత్యవతిరాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ కృషి ఫలితంగా ఐటీడీఏ తరుపున తొమ్మిది మండలాల్లో గిరిజన గ్రామాల అభివృద్ధికి రూ.18.89కోట్లు మంజూరవడం సంతోషకరం అన్నారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు చేపట్టాలనే లక్ష్యంతో గ్రామీణ అభివృద్ధి శాఖ, ఉపాధి హామీ నిధులు మంజూరు చేశారన్నారు. ములుగు అభివృద్ధికి పాటుపడుతున్న వారికి రుణపడి ఉంటామని అన్నారు.



మాట్లాడుతున్న గోవింద్‌నాయక్

- వివరాలు 10లో▸

వీనస్ జ్యువెల్లరీ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన



ఆభరణాలు కొనేందుకు వచ్చిన మహిళలు

హన్మకొండ చౌరస్తా: నగరంలోని బస్టాండ్ రోడ్డులో గల వీనస్ జ్యువెల్లరీ షోరూంలో శుక్రవారం ప్రారంభమైన జ్యువెల్లర్స్, డైమండ్స్ ఎగ్జిబిషన్ అండ్ సేల్స్‌కు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు జ్యువెల్లరీ చైర్మన్ రవిచంద్ర తెలిపారు. ఇక్కడ లభించే డైమండ్, బంగారు ఆభరణాల డిజైన్స్, వెరైటీలను ధరించి కస్టమర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నార న్నారు. కస్టమర్లకు నచ్చేలా అన్ని రకాల వెరైటీలు డిస్కౌంట్ ధరలకే అందిస్తున్నట్లు రవిచంద్ర తెలిపారు. శని, ఆదివారం కూడా ప్రజలకు ఈ ఎగ్జిబిషన్, సేల్ అందుబాటులో ఉంటుందని, ఆసక్తి గల కస్టమర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్ల అంతర్గత బదిలీలు

- సెక్షన్ల మార్పు సైతం..

కేయూ క్యాంపస్: కేయూలో ముగ్గురు అసిస్టెంట్ రిజిస్ట్రార్లను అంతర్గతంగా బదిలీలు చేస్తూ, సెక్షన్‌లు మార్పు చేస్తూ కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూలో ఆడిట్ విభాగంలో ఆడిట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న శ్రీలతను అకౌంట్స్ విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న కిష్టయ్యను కేయూలోని ఆడిట్ విభాగానికి ఆడిట్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. ఆయనకు పబ్లికేషన్ సెల్ ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలను కూడా అప్పగించారు. కేయూ పబ్లికేషన్ సెల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ నర్సింహారావును ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాలకు బదిలీ చేస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు.

జాతకం చెబుతున్న కోయదొరలు



కుర్రో.. కుర్రు..

ఎస్ఎస్ తాడ్వాయి: కుర్రో కుర్రు. ఉన్నది ఉన్నట్లు చెబుతా.. జరిగింది చెబుతా.. జరిగేది చెబుతా.. అంటూ మేడారంలో శుక్రవారం కొందరు కోయ దొరలు భక్తులకు జోష్యం చెప్పారు. మినీజాతర సందర్భంగా కోయ దొరలు ప్రత్యేక వేషధారణలో వనమూలికలతో కనిపించారు. భక్తులు వారి వద్దకు వెళ్లి జాతకం చెప్పించుకున్నారు.

నీటిని బాటిళ్లలో నింపుతున్న భక్తులు



జలధార..

సమ్మక్క కొలువైన చిలుకలగుట్ట నుంచి జలధార వస్తుంది. మేడారం వచ్చిన భక్తులు ఈ నీటిని పవిత్ర జలంగా భావించి నెత్తిన చల్లుకుంటున్నారు. ఇళ్లకు తీసుకెళ్తున్నారు. చిలుకలగుట్టపై ఉన్న వన మూలికలను తాకుతూ వచ్చే జలధార నీటిని తాగితే ఆరోగ్యానికి మంచిదనేది భక్తుల విశ్వాసం. దీంతో భక్తులు ఆనీటి కోసం క్యూ కడుతున్నారు.

తీరొక్క మొక్కులు..



మేడారానికి వచ్చిన భక్తులు చెట్ల కింద సేద తీరుతున్నారు. భక్తులు విడిది చేసిన చోటే అమ్మవారి ప్రతిరూపాలను పసుపు, కుంకుమలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కుటుంబ సమేతంగా పూజలు చేసి ఆతర్వాత అమ్మవార్ల గద్దెలకు చేరుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. మరికొంత మంది భక్తులు నూతన వస్త్రాలు ధరించి అమ్మవారి ఒడి బియ్యాన్ని తయారు చేశారు. శుక్రవారం బస చేసిన చోటో పూజలు నిర్వహించి గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు.

పోటెత్తిన భక్తజనం



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు అప్పజెప్తున్న భక్తులు



సమ్మక్క గద్దె వద్ద భక్తురాలి పూనకం



శివసత్తుల నృత్యాలు

- కిటకిటలాడిన అమ్మవార్ల గద్దెల ప్రాంగణం
- దారి పొడవునా వాహనాల బారులు

ఎస్ఎస్ తాడ్వాయి: సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు భక్తులు శుక్రవారం మేడారానికి పోటెత్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు మేడారానికి తరలివచ్చారు. భక్తులు జంపన్నవాగు వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద అమ్మవార్లకు పూజలు నిర్వహించి మనసారా మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో గద్దెల ప్రాంగణం కళకళలాడింది. కోరిన కొర్కెలు తీర్చాలని అమ్మవార్లకు భక్తులు ముడుపులుకట్టారు. గంట మోతతో గద్దెల ప్రాంగణం మార్మోగింది. వివిధ ప్రాంతాల భక్తుల రాకతో మేడారం కిక్కిరిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. మొక్కుల అనంతరం భక్తులు మేడారం పరిసరాల్లో చెట్ల కింద వంటలు చేసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు.

పకడ్బందీ ఏర్పాట్లు

భక్తుల రద్దీ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. దొంగతనాలు జరగకుండా సీసీఎస్ టీంలు పటిష్టమైన చర్యలు చేపట్టారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సెక్రటరీ అశోక్‌కుమార్, మాజీ సీనియర్ ఐఏఎస్ ఎంజీ గోపాల్, రోడ్ల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, డీఆర్‌ఓ రమాదేవి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఈఓ రాజేంద్రం దగ్గరుండి వీఐపీలకు ఆలయ సంప్రదాయంగా స్వాగతం పలికి వారిని సన్మానించి పూజారుల చేతుల మీదుగా ప్రసాదం అందించారు. జంపన్నవాగు నుంచి మేడారం దారి పొడవునా వాహనాలు బారులుదీరాయి. పోలీసులు వాహనాల్ని పార్కింగ్ స్థలాల్లోకి మళ్లించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ బస్సులు గద్దెల వరకు రావడంతో ఆర్టీసీ బస్సుల్లో వచ్చిన భక్తులు నేరుగా అమ్మవార్ల గద్దెలకు చేరుకున్నారు. భక్తులు, వీఐపీల రాకతో మేడారం సందడిగా మారింది.

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య

నర్సంపేట రూరల్: అప్పుల బాధతో నర్సంపేటకు చెందిన తుమ్మ విజేందర్(32) శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విజేందర్ వన్‌గ్రామ్ గోల్డ్ షాపు నడిపిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్నాళ్లుగా షాపు సరిగ్గా నడవపోవడంతో రూ.20 లక్షల వరకు అప్పు అయ్యింది. అది ఎలా తీర్చాలో తెలియక మనస్తాపంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టానికి తరలించారు. మృతుడి భార్య విద్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

నల్లబెల్లి: మండలంలోని లెంకాలపల్లిలో పురుగుల మందు తాగి మతి స్థిమితం లేని ఓ వ్యక్తి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. లెంకాలపల్లికి చెందిన గడ్డమీది సంపత్(40) గత కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. ఈక్రమంలో శుక్రవారం సంపత్ తన వ్యవసాయ భూమివద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఎగిసిపడిన అగ్ని కీలలు

- ఓల్డ్ ఫర్నిచర్ షాపులో అగ్ని ప్రమాదం
- ఐదుషాపులకు వ్యాపించిన మంటలు
- 1.37 కోట్లు ఆస్తి నష్టం జరిగినట్లు అధికారుల ప్రాథమిక అంచనా



ఎగిసిపడుతున్న మంటలు




మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఖిలా వరంగల్: వరంగల్ అండర్ బ్రిడ్జి ఇసుక అడ్డా జంక్షన్ సమీపం పెరకవాడలోని ఓల్డ్ ఫర్నీచర్ షాపులో శుక్రవారం తెల్లవారు జామున 3 గంటలకు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో భారీ ప్రమాదం జరిగింది. టేకు కర్ర చెక్కపొడికి షార్ట్ సర్క్యూట్‌తో నిప్పురవ్వలు అంటుకుని అగ్ని కీలలు ఎగసిపడ్డాయి. దీంతో పక్కనే ఉన్న ఐదు ఓల్డ్ ఫర్నీచర్ షాపులు, ఒక బైక్ మెకానిక్ షాపు, పాత సామాన్ల షాపు, ఒక ఇల్లు, ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్స్, సీడ్స్ గోదాంలోకి మంటలు వ్యాపించి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. రూ. రూ.2 కోట్లకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు ఫైర్, పోలీస్, రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు. రూ. 5 కోట్లకు పైగా ఆస్తిని కాపాడినట్లు అధికారులు అంచనాకు వచ్చారు.

అధికారుల అప్రమత్తం

ప్రమాదం జరిగిన సమయంలో పనికోసం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు గాఢ నిద్రలో ఉన్నారు. మంటలు ఎగిసిపడి పొగ కమ్ముకుపోయింది. దీంతో కార్మికులు, స్థానికులు రోడ్లపైకి పరుగులు తీశారు. స్థానికులు మిల్స్ కాలనీ పోలీసులు, వరంగల్ ఫైర్ అధికారులు అలర్ట్ అయ్యారు. ఆరు ఫైరింజన్లతోపాటు 40 మంది సిబ్బంది మంటలు ఆర్పారు. ఉదయం 4:30 నుంచి దాదాపు 12 గంటలు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ ఆస్తి నష్టం భారీగా జరిగింది. సర్వం కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని ఎండి అబ్దుల్లా, మాషా అల్లా ట్రేడర్స్, ఏటుజెడ్ ఫర్నీచర్స్, లక్ష్మి వినాయక పాత సమాన్ల షాపు, మహాలక్ష్మీ ఆటో మొబైల్ మెకానిక్ షాపు, మాధురి ఏజెన్సీస్ ఫెస్టిసైడ్స్, సీడ్స్ హోల్‌సేల్, రిటేల్ షాపు నిర్వాహకులు కోరుతున్నారు. కాగా.. ఘటనాస్థలిని అధికారులు పరిశీలించారు. రూ.5కోట్లు ఆస్తి నష్టం జరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. సుమారు రూ.1.37 కోట్లు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నట్లు వరంగల్ అగ్నిమాపక శాఖ డివిజన్ ఫైర్ అధికారి మామిడి భగవాన్‌రెడ్డి తెలిపారు.

ఒర్రెలో పడి కూలీ మృతి



అశోక్ మృతదేహం

ఏటూరునాగారం: సారలమ్మ ఒర్రెలో పడి మండలంలోని కొండాయి గ్రామానికి చెందిన దబ్బగట్ల అశోక్ (26) శుక్రవారం మృతి చెందాడు. వాజేడు మండలం పూసూరు గ్రామానికి చెందిన అశోక్ రెండు నెలల నుంచి తన అత్తగారి ఊరైన కొండాయిలో కూలీ చేసుకుంటూ భార్య పిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. అశోక్ ఈనెల 2న గోవిందరాజుల జాతరకు వెళ్లి మద్యం సేవించి రాత్రి 7 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. గంగస్నానానికి వెళ్లొస్తానని ఊరు శివారులోని సారలమ్మ ఒర్రెకు చేరుకున్నాడు. ఒర్రెలో పడి మృతి చెందాడు. మృతుడి తల్లి దబ్బగట్ల నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ పేర్కొన్నారు.

'ఎర్రబెల్లీ' అభివృద్ధి ఏది?

- అడుగడుగునా 'అరూరి' భూకబ్జాలు
- వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల



మాట్లాడుతున్న షర్మిల

పర్వతగిరి: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సొంత మండలంలో అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. పర్వతగిరి మండల కేంద్రంలో శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో ఆమె మాట్లాడుతూ.. మంత్రి దయాకర్‌రావు సొంత గ్రామమైన పర్వతగిరిని ఏమైనా పట్టించుకున్నాడా అని ప్రశ్నించారు. వంద పడకల ఆస్పత్రి కట్టలేదు. డిగ్రీ, ఇంటర్ కాలేజీలు లేవు కానీ ఈయన పంచాయతీరాజ్ శాఖ మంత్రి అంట అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర సర్కారు పంచాయతీలకు నిధులు ఇవ్వదని, కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా దక్కనివ్వదన్నారు. స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేశ్ సివిల్ కాంట్రాక్టర్‌గా ఉండి ఏ-1 కాంట్రాక్టర్ ఎలా అయ్యాడంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే అరూరి అడుగడుగునా.. భూకబ్జాలకు పాల్పడుతున్నారని, అరాచకాలు భరించలేకే వర్ధన్నపేటలో సొంత పార్టీ కౌన్సిలర్లు ఎదురు తిరుగుతున్నారన్నారు. వైఎస్ఆర్ హయాంలో వ్యవసాయం పండుగలా ఉండేదని, నేడు కేసీఆర్ పాలనలో దండగలా మారిందన్నారు. వైఎస్సార్‌టీపీని ఆశీర్వదిస్తే వైఎస్ ప్రవేశ పెట్టిన పథకాలను మళ్లీ అమలు చేస్తామన్నారు.

సాఫీగా సాగిన షర్మిల పాదయాత్ర..

నెక్కొండ: వైఎస్.షర్మిల ప్రజాప్రస్థానం యాత్ర నర్సంపేట నియోజకవర్గం పార్టీ కార్యకర్తలు, ప్రజల అండదండలతో పోలీసుల కట్టుదిట్టమైన చర్యల మధ్య శుక్రవారం సాఫీగా సాగింది. ఓపక్క ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ.. షర్మిల తలపెట్టిన పాదయాత్ర ఉత్కంఠకు తెరపడగా అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నెక్కొండలోని వరంగల్ రోడ్డు నుంచి చింత నెక్కొండ క్రాస్ రోడ్డు మీదుగా సాయిరెడ్డి పల్లి, అడ్డబాట (ఏబీ) తండా వరకు పాదయాత్ర సాగింది. తెలంగాణలో వైఎస్సార్‌టీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్‌పైనే తొలి సంతకం చేస్తానని హామీ ఇచ్చారు. పాదయాత్రలో వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు పిట్టల రాంరెడ్డి, డాక్టర్ నగేశ్, వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నాడెం శాంతికుమార్, జిల్లా నాయకుడు భూక్యా లాలునాయక్, నర్సంపేట, నెక్కొండ మండలాల అధ్యక్షులు నూనె నర్సయ్య, సురేందర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జాటోతు అశోక్‌నాయక్, అలువాల సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి

కేసముద్రం: మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతూ మండల కేంద్రం శివారు బ్రహ్మంగారి తండాకు చెందిన బానోతు అంకిత(14) శుక్రవారం మృతి చెందింది. బానోతు వెంకన్న కుమార్తె అంకిత మండల కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఇటీవల అంకితకు తలనొప్పి రావడంతో, హనుమకొండలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈనేపథ్యంలో మెదడులో రక్తం గడ్డకట్టి పరిస్థితి విషమించి ఆమె గురువారం రాత్రి మృతి చెందింది.

విజేతగా నిలిచిన వాగ్దేవి కళాశాల జట్టుకు కప్ అందజేస్తున్న 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్



సాక్షి ట్రోఫీ.. 'వాగ్దేవి' కైవసం



సీనియర్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన నిట్ క్రీడాకారులకు కప్ అందజేస్తూ..



జూనియర్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన ఎల్‌బీ కళాశాల జట్టు



జూనియర్ విభాగంలో విన్నర్‌గా నిలిచిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు

- రన్నరప్‌గా నిలిచిన నిట్ జట్టు
- జూనియర్స్ విజయకేతనం ఎగురవేసిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
- రన్నరప్‌గా లాల్‌బహదూర్ కళాశాల

రామన్నపేట: వారం రోజులుగా 24 జట్లతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు అద్యాంతం ఉత్సాహంగా కొనసాగాయి. యూనివర్సిటీ స్థాయి పోటీలను తలదన్నేలా క్రీడాకారులు రెట్టింపు ఉత్సాహంతో ఇందులో పాల్గొనడంతో సాక్షి క్రికెట్ పోటీలకు అత్యంత ఆదరణ లభించింది. తమ కళాశాల జట్లు విజయం సాధించాలనే తపనలో కళాశాలల యాజమాన్యాలు సైతం క్రీడాకారులను ఉత్తేజపర్చేందుకు ఎల్బీ కళాశాల మైదానానికి చేరుకుని ఆయా సంస్థల యాజమాన్యాలు సైతం మరింత ఉత్సాహాన్ని నింపాయి. శుక్రవారం సీనియర్ విభాగంలో ఫైనల్ మ్యాచ్‌ను ఎల్బీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు టాస్ వేసి, బ్యాటింగ్ చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఫైనల్ మ్యాచ్ నువ్వా..నేనా అనే రీతిలో జరిగింది. నిట్ జట్టుపై వాగ్దేవి జట్టు 10 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెల్చుకున్న నిట్ జట్టు బౌలింగ్ ఎంచుకోగా మొదట బ్యాటింగ్ చేసిన వాగ్దేవి జట్టు 89 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన నిట్ జట్టు 10 ఓవర్లలో 79 పరుగులు మాత్రమే సాధించగలిగింది. వాగ్దేవి జట్టులో క్రీడాకారుడు సిద్ధార్థ 27 బంతుల్లో 48 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నాడు.

జూనియర్స్ విభాగంలో..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల జూనియర్ విభాగంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విజయకేతనం ఎగురవేసింది. ఫైనల్ మ్యాచ్‌లో ఎల్బీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల జట్లు తలపడగా టాస్ గెలుచుకున్న పాలిటెక్నిక్ బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 111 పరుగులు సాధించింది. అనంతరం ఎల్బీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 93 పరుగులు మాత్రమే సాధించగలిగింది. పాలిటెక్నిక్ కళాశాలలో సాయి వంశీ 20 బంతుల్లో 54 పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

బహుమతుల ప్రదానం

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు 'కుడా' చైర్మన్ సుందర్‌రాజు యాదవ్, సాక్షి బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, ఈవెంట్ మేనేజర్ సుమన్, వరంగల్ స్టాఫ్ రిపోర్టర్ వాంకె శ్రీనివాస్, టీవీ కరస్పాండెంట్ విజేందర్ రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా 'కుడా' చైర్మన్ సుందర్ రాజు మాట్లాడుతూ.. సాక్షి మీడియా ఆధ్వర్యంలో క్రికెట్ పోటీల నిర్వహణతో యువ క్రీడాకారుల్లో మంచి ఉత్తేజాన్ని నింపారని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్బీ కళాశాల లెఫ్టినెంట్ అధికారి ఎం.సదానందం, కళాశాల పీడీ ప్రభాకర్, వాగ్దేవి కళాశాల యజమాన్య ప్రతినిధి హరేందర్, నిట్ ఫిజికల్ డిపార్టుమెంట్ ప్రతినిధి, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎల్బీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ